
స్నేహితురాలి శత్రువును అంతం చేయాలనుకున్న ఆమెకు కనిపించిన మరో శత్రువు?

# అందమైన శత్రువు




"హిస్టరీ ఆఫ్ క్రైమ్ - ఎ ఫోరెన్సిక్ వ్యూ" అన్న పుస్తకం చదువుతున్న ఇన్స్పెక్టర్ కుమారి చటుక్కున తలెత్తింది.

గుమ్మంలో మోహన...

మోహన సమస్య ఈ వివాహ వ్యవస్థ అంత పాతది.

ఆమె భర్త రుద్రమూర్తి... ఆమెకు పరిష్కారంలేని సమస్య...

"నన్ను చంపాలని చూస్తున్నాడు." అని వాపోతుంది మోహన.

మోహన చక్కని చుక్క... ఎం.ఏ సైకాలజీలో తామిద్దరూ క్లాస్‌మేట్స్.

చక్కటి శరీర సౌష్టవం, వర్చస్సుగల మేని చర్మం, చురుకైన కళ్లు, దంతపు బొమ్మలా మెరిసిపోతూ వుంటుంది మోహన.

అలాంటి కుందనపు బొమ్మ, కురవంజి కొమ్మను రుద్రమూర్తి ఎందుకు చంపాలనుకుంటాడు?

మోహన ఆర్థికంగా వెనుకబడీ లేదు... ఆమె పేర లక్షల ఆస్తి వుంది.


ఒకటి రెండుసార్లు రుద్రమూర్తిని చూసింది - కాని అతను భార్యను బాధపెట్టే మనిషిలా కనపడలేదు.

"ఎప్పియరెన్సెస్ ఆర్ డిసెప్టివ్" రూపం ఒక మోసం.

మరి రుద్రమూర్తి లోపల మనిషిలోమనిషి ఎలాటివాడో?

మోహనలో తొందరపాటు తెలుస్తూనే వుంది. రుద్రమూర్తి ఆమెనూ చంపి తప్పించుకోగలడా?

పైగా క్రైమ్స్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్స్పెక్టర్‌గా తన భార్య స్నేహితురాలు పనిచేస్తుందని తెలిసి...



ఏమాత్రం రేషనాలిటీ వున్నా అలా చెయ్యడు!

మరి మోహన?

సైకాలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసింది. అతని సైకాలజీ బాగా స్టడీ చేసి తనకనుకూలంగా మార్చుకోవచ్చుగా.

''నన్ను క్షమించవే... నువ్వు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో వున్నావుకదా అని వచ్చాను. ఆ

రాక్షసుడు నన్ను పొట్టన పెట్టుకున్న తర్వాత, అప్పుడు రా విచారణకు. ఫైరింజన్ వాళ్లు బూడిద ఎత్తుకెళ్లడానికి, మీరు టేపులు తీసుకుని, కెమెరాలు తీసుకుని ఫోటోలు తీసుకెళ్లడానికి చివరలో రావడం అలవాటేకదా...'' మోహన అంది నిష్ఠూరంగా.

''సమస్య అంత సులభమైందికాదు. భార్యాభర్తలవ్యవహారం. ఏమాత్రం బెడిసినా నీ సంసారం నాశనమవుతుంది'' అంది కుమారి.

''ఇప్పుడు బాగుంది కనుకనా'' మోహన చిరాగ్గా అంది.

''సరే... నేను ఇన్వెస్టిగేట్ చేస్తాను. నువ్వు నిశ్చింతగా వుండు... రుద్రమూర్తిమీద ఫైలు ఓపెన్‌చేస్తాను. అఫీషియల్‌గా చెయ్యడానికి లేదు. నా పెర్సనల్ కెపాసిటీలో. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు.''

మళ్లీ మోహన వచ్చిందంటే రుద్రమూర్తిమీద కంప్లయింట్‌తోనే -

''రావే - రా... కూర్చో...'' అని లోపలకు చూసి ''శాంతమ్మా రెండు కాఫీ పట్రా'' అని వంటింట్లో వున్న వంటమనిషి శాంతమ్మకు చెప్పింది.

మోహన ముఖంలోవిషాదం కొట్టొచ్చినట్టు కనపడుతోంది.

''కుమారీ - నా రోజులు దగ్గర పడ్డాయి'' మోహన గద్గద స్వరంతో అంది.

ఆమె చేతిమీద చెయ్యివేసి అంది కుమారి.

''చదువుకున్నదానివి. చదువులో నా కన్నా నువ్వే బ్రైట్... జీవనోపాధికోసం నాలా ఉద్యోగం చేసే అవసరమూ లేదు. ఎందుకీ బేలతనం?''

''అదేనే నా వీక్‌నెస్ - నా డబ్బే నా మెడకు ఉరిత్రాడు. నన్ను తెలివిగా తప్పించి రుద్రమూర్తి నా ఆస్తిని కాజేయదలచుకున్నాడు'' అంది మోహన.

దురదృష్టం అంటే ఇదేనేమో!

అన్నీ వుండి జీవితంలో శాంతిలేదు మోహనకు.

ఉద్యోగం లేకపోతే తనకు గడవదు. చదువు అయిన తర్వాత తన తండ్రి అన్నాడు ''అమ్మాయి కుమారీ - నీ చదువు పూర్తయింది. ఇక నేనూ మూణ్ణెల్లలో రిటైర్ అవుతాను. ఇక ఏదైనా పని చూసుకోవాలమ్మా నువ్వు. ఈ ఇంటి ఆలనా పాలనా ఇక నీదే...'' యధాలాపంగా సివిల్ సర్వీసెస్‌కి అప్లయ్ చేసింది. ప్రిలిమినరీ పరీక్షలు, మెయిన్ పరీక్షలు, వైవా అయి రెస్యూమ్ వ్రాసేటప్పుడు అనుకుంది.

''ఇది వచ్చిందా - చచ్చిందా? ఏ ప్రైవేటు కంపెనీలోనో గుమాస్తానే తనకి'' అనుకుంది.

అదృష్టం, నువ్వుతూ తన తలుపు తట్టింది. ఐపిఎస్‌లో సెలెక్ట్ అయింది.

ఐపిఎస్ ట్రైనింగ్ అయి ఇన్స్‌పెక్టర్‌గా చేరింది. డిఎస్‌పీ ప్రమోషన్‌కోసం ఎదురుచూస్తూ వుంది.

తన భర్త పరశురాం...

పర్సనాలిటీలోగాని, అందంలోగాని తనకన్నా ఎన్నో ఎక్కువవాడు. తనకు లభించాడు.

నిజానికి పరశురాంముందు తను సిల్కు లాల్చీముందు ముతక చీరెలాంటిది.

అలాంటి భావం ఎప్పుడూ చూపలేదు పరశురాం.

అతని పచ్చటి బుగ్గలు, నల్లని నొక్కుల జుట్టు, అందమైన కళ్లు వీలైనప్పుడల్లా ఆరాధనగా చూస్తూనే వుంటుంది.

తన అదృష్టం.

మరి మోహన - కావాలంటే తన డబ్బుతో ఏదైనా కొనుక్కోగలదు. కాని - ఇలా అశాంతిగా - అసహనంగా - మనసు కాలుతూ విధిలేక

రుద్రమూర్తితో వుంటోంది.

''పోనీ - మోహనా! విడాకులు తీసుకోవచ్చుగా'' అంది కుమారి.

తేలుకుట్టినట్టు ఉలిక్కిపడింది మోహన.

'ఏమిటే నువ్వంటున్నది? మాది మా జమిందార్ల వంశం - ఇంకా ఎవరూ ఇటువంటివాటికి తెగించలేదు. నేను విడాకులు అడిగితే అమ్మా నాన్నా, ఇంటిల్లిపాది విషం తీసుకుని చస్తారు. నా పెళ్లి నీలాకాదే... నేను రుద్రమూర్తిని చూడనుకూడాలేదు. సాంప్రదాయం అంటూ నన్నో మర్డరర్‌కిచ్చి చేశారు. అంతా వాళ్లే. నేను చెప్పుకోడమేగాని నా గోడు ఎవ్వరూ పట్టించుకోరు''

విషాదం మోహన ప్రతి మాటలోనూ కొట్టొచ్చినట్టు వినపడింది కుమారికి.

మోహన వెళ్లిపోయింది.

రేపటి ప్రోగ్రాం ఏమిటి అని డైరీ చూసుకుంటున్న కుమారికి హఠాత్తుగా కొన్ని ప్రశ్నలుదయించాయి.

నేనేం చేయాలి? రుద్రమూర్తిని అనుమానంమీద అరెస్టు చేసి సెల్‌లో వెయ్యాలా? అది సాధ్యంకాని పని. భార్యచెప్పిన ఓరల్ సాక్ష్యంతో భర్తను అరెస్టు చెయ్యలేం? ఓవేళ అలా చేసినా, మోహనకేం ఒరుగుతుంది? రుద్రమూర్తిని బెదిరిస్తే! అది మరీ చిక్కు - రుద్రమూర్తి ఎదురుతిరిగి ''అనవసరంగా ఇబ్బంది పెడుతోంది? అనుమానం వుంటే 'చార్జ్' చేయండి'' అని లీగల్‌గా ప్రొసీడయితే... మరో చిక్కులో పడుతుంది కేసు.'' అప్పుడే నిర్ణయించుకుంది తనేం చెయ్యాలో-

● ● ●

ఆ రాత్రే పరశురాంకు చెప్పింది రు[illegible]ర్తి సంగతి.

''నేను డిపార్ట్‌మెంటల్‌గా రుద్రమూర్తి కేసు టేకప్ చేయలేను.''

''ప్రీమా - ఫేషియా'' కేసుంటే అది వేరే విషయం. మీరు ప్రైవేట్ బిజినెస్ మేన్. బిజినెస్‌లోనూ పరిశోధనలు అవీ మీకు మామూలేకదా - అవతలివాడి టర్నోవర్,

# జాలి ఖరీదు?



ఎయిడ్స్ వ్యాధి భయంకరమైన వ్యాధి. ఇటలీలో ప్రస్తుతం 30 వేలమంది దాకా ఎయిడ్స్‌తో బాధపడుతున్నారట. వీరిమీద జాలితో ఇటలీ ప్రభుత్వం వారిని జైల్లో పెట్టడాన్ని నిషేధించిందట. ఫలితంగా మొన్నీమధ్య కొందరు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు పట్టపగలు ఎలాంటి మాస్క్ లేకుండా సెక్యూరిటీ కెమెరాల ముందే పన్నెండువేల డాలర్ల విలువైన ఇటలీ కరెన్సీని దొంగిలించినా పోలీసులు ఏమీ చేయలేకపోయారట! జైల్లో పెట్టరనే ధైర్యంతో ఇలా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులంతా విజృంభిస్తే... మరి ఇటలీ ఏమైపోతుందోగదా... ఇది నిజంగా ఆలోచించవలసిన విషయమే.

- జూపిటర్

మార్జిన్స్, ఆర్డర్స్ - ఇలా తెలుసుకుంటూ వుంటారు. మీ నెట్‌వర్క్ ఉపయోగించి రుద్రమూర్తి డేటుడే రిపోర్ట్సు నాకు కావాలి. ముఖ్యంగా అతని ప్రైవేట్ లైఫ్''

భార్య చెప్పిన మాటలకు పరశురాం సాలోచనగా తల పంకించి అన్నాడు.

''నో ప్రాబ్లం. కానీ నీ స్నేహితురాలు చెప్పినంత మాత్రాన అలా పర్సనల్ లైఫ్ పరిశోధించడం బాగుంటుందా అని''

''ప్రాణ, మాన, విత్త భంగములందు అనృతములాడవచ్చు నధిప'' అన్నారుకదా'' అంది కుమారి.

పరశురాం నవ్వుతూ కుమారిని చూశాడు.

''అందుకే నువ్వంటే నాకిష్టం'' అంటూ దగ్గరగా తీసుకున్నాడు.

పరశురాం బలమైన కౌగిలిలో కరిగిపోతున్న కుమారికి ఈ కేసుకి మరో యాంగిల్ ఉన్న సంగతి తెలియలేదు.

● ● ●

నాలుగు రోజుల్లో పరశురాం రిపోర్ట్సు కుమారికందింది.

''రుద్రమూర్తి బిజినెస్ అవర్స్ అయిపోయినా ఇంటికెళ్లడు. నేరుగా బార్‌కే.

రాత్రివరకు తప్పతాగి ఇంటికెళతాడు.

అప్పుడప్పుడు పొందుకోసం రెడ్‌లైట్ ఏరియాకు కూడా వెడతాడు.

బిజినెస్ నష్టంలోవుంది''

ఆ రిపోర్ట్ చదివిన కుమారి అనుకుంది.

''నో వండర్! ఈ రుద్రమూర్తి మోహనను, ఆది అన్నంత పనీ చేసే అవకాశం లేకపోలేదు''

అయితే కథ చిత్రమైన మలుపు తిరిగింది ఇక్కడే.

కుమారి సిటీ అవుట్ స్కర్ట్స్‌లో ఇన్‌స్పెక్షన్ పూర్తిచేసి వస్తూ వుంది. దారిలో రేడియేటర్ హీటయితే డ్రైవర్ జీపు ఆపాడు.

కుమారి దగ్గరలో వున్న ఓ చెట్టుదగ్గర ఆగింది.

ఏదో ఆలోచిస్తుంటే రివ్వున ఒక రాయి వచ్చి, ఆమె నుదుటికి తాకింది.

రక్తం బొటబొటా కారింది.

రేడియేటర్‌లో నీళ్లు పోస్తున్న డ్రైవర్ అది చూశాడు.

''అమ్మా!'' అంటూ దగ్గరకొచ్చాడు.

కర్చీఫ్‌తో రక్తం కారకుండా ఆపి, హాస్పిటల్‌కు వెళ్లింది. డాక్టర్ టిటనస్ ఇంజక్షన్ ఇచ్చి, డ్రెస్సర్‌కి చెప్పాడు బేండేజ్ వేయమని.

బాండేజ్ కట్టించుకుని వెళ్లిపోతూ వుంటే డాక్టరడిగాడు.

''ఎనీ అన్‌సోషల్ ఎలిమెంట్''

''ఐ డోన్ట్ నో'' అంది కుమారి.

ఆ సాయంత్రం పరశురాం చెప్పేటంతవరకు ఆమెకు తెలియదు. రుద్రమూర్తి మనుషులు దాడి చేశారు.... తనక్కడ వున్నట్టు ఎలా తెలుసు?

మర్నాడు పోస్టులో ఒక ఉత్తరం వచ్చిందామెకు.

''పేడరంగు ఖాకీ డ్రెస్సు వేసుకున్న సుందరీ! ఇది సాంపిల్'' అని వుందా ఉత్తరంలో - సంతకంలేదు.

ఆ ఉత్తరం పరశురాంకు చూపించింది.

''మీ స్నేహితురాలి మొగుడు సామాన్యుడు కాడు. నిన్నే బెదిరిస్తున్నాడు. పెళ్లాన్ని చంపడం వాడికో లెక్కా?'' పరశురాం అన్నాడు.

అప్పుడే రుద్రమూర్తి ఫైల్‌లో వ్రాసింది కుమారి.

''రుద్రమూర్తి ప్రమాదకరమైన వ్యక్తి. తన భార్య విషయంలో నేను పరిశోధిస్తున్నానని నామీద దాడిచేసి రాయితో కొట్టాడు. ఎవిడెన్స్ - ట్రీటింగ్ డాక్టర్స్ రికార్డ్స్''

ఆరోజునుంచి రుద్రమూర్తిని పట్టుకోవాలన్న పట్టుదల ఎక్కువయింది. అతనిమీద దూరంనుంచే నిఘా వేసింది.

రుద్రమూర్తి కనిపెట్టినట్టున్నాడు.

బార్‌కి వెళ్లడంలేదు. సరాసరి ఇంటికి వస్తున్నాడు.

● ● ●

మరో సంఘటన జరిగింది, మరో వారం రోజుల్లో.

రైల్వే క్రాసింగ్ దగ్గర ఆగింది జీపు - లోకల్ రైలు ఇంకా రాలేదు.

''ఛఛ. ఎక్కడో రైలుండగానే ఇక్కడే మూసేస్తారు'' అనుకుంటూ జీపు దిగింది.

'సర్'మన్న చప్పుడయింది. తల తిప్పింది కుమారి - జబ్బలో 'చుర్రు'మన్న బాధ.

గబుక్కున చూసింది.

పదునైన చాకు తన జబ్బలో గుచ్చుకుని, క్రింద పడింది.

మామూలు పళ్లు కోసుకునే చాకు.

రక్తం ఫౌంటెన్లా చిమ్మింది. ఖాకీ యూనిఫాం రక్తంతో తడుస్తోంది. మరొక్కసారి హాస్పిటల్‌కి వెళ్లక తప్పలేదు. డాక్టర్ ట్రీట్‌మెంట్ పూర్తయిన తర్వాత అడిగాడు.

''ఎనీ అన్‌సోషల్ ఎలిమెంట్స్''

''ఎస్. అన్ సోషల్ బ్రూట్'' అంది కోపంగా కుమారి.

● ● ●


రుద్రమూర్తి తలుపు చప్పుడయితే చూశాడు.

ఎదురుగా ఇన్‌స్పెక్టర్ కుమారి.

ఒకటి రెండుసార్లు చూశాడు ఆమెను మోహనతో.

''రండి ఇన్‌స్పెక్టర్'' అన్నాడు సాదరంగా.

కుమారి పళ్లు పటపట కొరుకుతూ అంది.



''ఎనఫ్... ఎనఫ్ ఈజ్ ఎనఫ్''

రుద్రమూర్తి అయోమయంగా చూస్తూ అడిగాడు. ''వ్వాట్... వ్వాట్ డూయు మీన్''

''డోన్ట్ ప్రిటెండ్... దీనికి అనుభవిస్తావ్'' అంటూ విసవిసా వెళ్లిపోయింది.

మర్నాడు మరో ఉత్తరం వచ్చిందామెకి.

''పూలిష్ ఇన్స్పెక్టర్ - నీ బెదిరింపులు నన్నేం చెయ్యలేవ్ - నీకో ఛాలెంజ్ - నన్ను అవమానించివాళ్లు ఎవ్వరూ బతికిలేరు - నువ్వుంటావా?''

ఉత్తరం చదివిన కుమారి మండిపడింది.

''ఈ రుద్రమూర్తిగాడికి ఎంత ధైర్యం? నన్ను చంపుతానని బెదిరిస్తాడా? వాడ్ని అరెస్టుచేసి, పోలీస్ కానిస్టేబుల్స్కి చెబితే వాళ్లు ఓ చూపు చూస్తారు... కాని రుద్రమూర్తిని ఎలా అరెస్టు చెయ్యడం? ఏ ఆధారాలతో సంతకంలేని ఈ ఉత్తరాలతోనా? వీలుకాదు - ఎలా ఎలా?''

ఆమె మధనపడుతూనే వుంది. రుద్రమూర్తి ఈజ్ డేంజరస్ క్రిమినల్. ముందు మోహనను కాపాడాలి.

మోహనను తీసుకురమ్మని పోలీసుని పంపింది.

ఆమె ఇంటిలోలేదు.

కంగారుగా మోహన పుట్టింటికి ట్రంక్ కాల్ బుక్చేసింది.

ఆ కాల్ మెచ్యూర్ అయ్యే లోపల ఒకటే టెన్షన్.

రుద్రమూర్తి ఆమెను చంపేసి, శవాన్ని డిస్పోస్ ఆఫ్ చేసేశాడా?

''అయ్యో మోహనా!''

టెలిఫోను మ్రోగింది.

మోహన తండ్రిగారు మాట్లాడారు.

''ఎవరు?''

''నేను మోహన ఫ్రెండ్ని. మోహన వుందా?...''

''ఆ... నాలుగు రోజులయింది వచ్చి. మీ వూరునుంచి ఫోనుకోసం ఎదురుచూస్తూ వుంది. అది వచ్చిన తర్వాత వెళ్లాలని''

మోహన ఊరెళ్లింది. ఆమె క్షేమం?

వెళ్లిన ఆమె ఎవరి ఫోన్కోసం ఎదురుచూస్తోంది?

నవ్వుకుంది కుమారి.

మానసికోద్వేగంతో తను మరచిపోతూ వుంది.

మోహన తన ఫోనుగురించే ఎదురు చూస్తూ వుంది.

● ● ●

డ్యూటీనుంచి వచ్చిన తర్వాత స్నానం చేసి భోజనం చేసింది కుమారి.

పరశురాం ఊళ్లో లేడు.

వంటమనిషి వంటిల్లు కడిగి తుడిచి వెళ్లిపోయింది.

రుద్రమూర్తి ఫైలుతీసి చదవడం మొదలుపెట్టింది.

''నైఫ్ ఎటాక్ తర్వాత రాసిన ఆఖరివాక్యం చదివింది.

''రుద్రమూర్తి పగబట్టిన పాములాంటివాడు. తన భార్యకు సాయం చేస్తున్నానని నన్ను రెండుసార్లు గాయపరిచాడు.

అనుకోనిది ఏమైనా జరిగితే నాకు... అది రుద్రమూర్తి పనే అని అనుకోవాలి''

ఫైలు మూసి, లైటు ఆర్పి పడుకుంది.

ఆమె నిద్రపోలేదు.

చెవులు రిక్కించి వింటోంది.

అర్ధరాత్రి తర్వాత ఆమె ఊహించినట్టుగానే!

మెత్తని అడుగుల చప్పుడు.

మెల్లిగా తన పడకగదివైపు.

చీకటిలో లీలగా కనిపిస్తోంది ఆకారం.

రెండు మెరుపులు మెరిశాయి శబ్దంతోపాటు.

సైలెన్సర్‌వున్న తుపాకీలోనుంచి వచ్చిన గుళ్లు.

కుమారి బెడ్‌మీద నిప్పులు కురిపించాయి.

చప్పుడు కాకుండా ఆ ఆకారం వెళ్లిపోయింది.

బీరువా ప్రక్కన దాక్కున్న కుమారి బయటకు వచ్చింది. లైటు వేసింది.

''దయాసాగర్! దయాసాగర్!'' అని పిలిచింది.

ప్రక్క గదిలోనుంచి ఒక వ్యక్తి బయటకు వచ్చాడు.

ఎత్తుగా బలంగా వున్నాడు. బట్టతల... అతను కుమారి సీనియర్. తుపాకీ గుళ్లు, అవి ఏ పిస్టల్నుంచి పేల్చబడ్డాయి అన్నవి పరిశోధిస్తాడు. 'బాలిస్టిక్ ఎక్స్‌పర్ట్'

అతని సలహా మేరకే కుమారి తన మంచంమీద పడుకోలేదు.

''ఇక మనం రుద్రమూర్తిని నిస్సంకోచంగా అరెస్టు చెయ్యొచ్చు. అతని కాలిముద్రలు, పిస్తోలు గుళ్లూ''

దయాసాగర్ ఆమెకేసి దీర్ఘంగా చూసి అన్నాడు ''లాభంలేదు''

''ఏం?''

''రుద్రమూర్తి హంతకుడు కాదు''

● ● ●

దయాసాగర్ చెప్పినది వింటూ వుంటే మతిపోయింది కుమారికి.


''అవును. రుద్రమూర్తి హంతకుడు కాదు. చంపబడేదీ మోహనకూడా కాదు''

''మోహన రుద్రమూర్తి టార్గెట్ అని అనుకుంటున్నాను''

''అసలు టార్గెట్ - మోహనకాదు... నువ్వే... నువ్వే...''

అదిరిపడింది కుమారి... ఆ తర్వాత దయాసాగర్ చెప్పింది విన్నది.

## ఇష్టం



''ఏవండి..మీకు టీవీ చూడ్డం ఇష్టమా? నాతో మాట్లాడ్డం ఇష్టమా?'' అడిగింది భార్య.

''టీవీ చూడ్డమే ఇష్టం'' చెప్పాడు భర్త.

''ఎందుకని'' అడిగింది భార్య.

''ఇష్టం లేనప్పుడు టీవీ ఆపేయచ్చు కదా'' టక్కున అన్నాడు భర్త.

- జి. వాసు (ఖమ్మం)

''రుద్రమూర్తి ఎవ్వరికీ హానిచేసే మనస్తత్వం కలవాడు కాదు. మోహన అతన్ని వదిలించుకోవాలని, నీతో లేనివి చెప్పింది''

''ఎందుకు?''

''మోహనకు మరో అందగాడు జతయ్యాడు. అతనికి భార్య అంటే ఇష్టం లేదు. మోహనకి చాలా డబ్బుంది. పైగా అందగత్తె. మోహనకు భర్తా, ఆ అందగాడికి భార్యా అడ్డంకులు.

ఒక దెబ్బతో ఇద్దర్నీ వదిలించుకోవాలని ప్లాన్ వేశారు.

అందులో భాగంగానే నీచేత రుద్రమూర్తి మీద చెడుగా రాసేటట్టు చేసి కేసు బిల్డప్ చేశారు.

నిన్ను చంపితే రుద్రమూర్తి పట్టుబడతాడు. ఉరిశిక్షో, ఆజన్మ శిక్షో పడుతుంది. ఒక పోలీసాఫీసర్ని చంపితే శిక్ష తీవ్రంగా వుంటుందికూడా. నీచేత్తో వ్రాసిన కామెంట్స్ రుద్రమూర్తి పాలిట యమపాశాలే!

''నన్నెందుకు చంపాలి? ఆ అవసరం ఎవరికుంది?''

దయాసాగర్ కొన్ని క్షణాలు మౌనంగా వుండి అన్నాడు.

''అన్ని విషయాలు కూలంకషంగా పరీక్షించే మనం కొన్ని పొరపాట్లు చేస్తుంటాం. ఒక క్రిమినల్ గురించి వెతికే పోలీసు యంత్రాంగం తమ ఇళ్లల్లో ఆ క్రిమినల్ వుంటే పట్టుకోలేరు. ఎందుకంటే అదే గ్రే ఏరియా. మనం అందరి నీడల్ని చూసి వాళ్ల పేగులు లెక్కపెట్టగలం. మన నీడ మనం చూసుకోము. మన ఇంట్లో కనపడని శత్రువులుండొచ్చు.

''వివరంగా చెప్పండి'' అంది కుమారి.

''సారీ పరశురాం. నువ్వు ప్రేమించే నీ భర్త నిన్ను ప్రేమించడంలేదు. అతనూ, మోహనా ఒకటయ్యారు. నిన్నూ, రుద్రమూర్తిని తన చేతికి బురద అంటకుండా తొలగించాలనుకుని పథకం వేశారు.

తీరిగ్గా ఆలోచిస్తే నీకే అర్థమవుతుంది. ప్రతిదాన్ని వెరిఫై చేసే నువ్వు, పరశురాం చెప్పినది నిజమని నమ్మావు... అతను చేయించిన ఎటాక్స్ రుద్రమూర్తి చేయించాడని నమ్మావ్. నువ్వు ఎక్కడికెళతావో పరశురాంకే తెలుసు...'' రుద్రమూర్తికి కూడా తనమీద జరుగుతున్న కుట్ర తెలియదు. నువ్వు చాకు దాడికి గురైన తర్వాత రుద్రమూర్తి గదికి వెళ్లి బెదిరించావ్. దానితో నాకు చెప్పాడు. రుద్రమూర్తి నాకు బాగా తెలుసు. నా చిన్నప్పటి స్నేహితుడు. నా ధృక్పథంలో నేనూ కూపీ లాగాను. మోహన, పరశురాంల 'సినిస్టర్ డిజైన్' బయటపడింది.

''ఆ ఉత్తరాలు?''

''అవి పరశురాం సృష్టి''

కుమారికి పూర్తిగా అర్థమవుతోంది.

''పరశురాం - మోహన'' ఆమెను పరిహసిస్తున్నట్లు అనిపించింది.

మోహన దురదృష్టం గురించి ఆలోచించిన తను - తన ముంగిట వున్న మోసం తెలుసుకోలేకపోయింది. తన దురదృష్టం ఇప్పుడు వీడిపోయినందుకు సంతోషంగా వుంది. ప్రాణస్నేహితురాలు - ప్రాణప్రదమైన భర్త - హో ... మై ఫుట్....

తెల్లవారుతుండగా....

పరశురాం వున్న పోలీసు జీపు ఆమె ఇంటి గేటు దాటింది.